

# భోజనాంతే...

అది బ్రాహ్మణ వీధి.

పున్నయ్యగారి పొలం మాదిగ కోటాయి కౌలుకి చేస్తున్నాడు. అప్పట్లో వారినలాగే అనేవారు. పున్నయ్యగారిల్లు కృష్ణ వొడ్డున, గుడికి పడమట. కోటాయి పున్నయ్యగారితో సలహా సంప్రతింపులకు రావాలంటే మహా ఇబ్బందిగా ఉండేది. బ్రాహ్మణవీధిలో నడవటానికి వీల్లేదు గదా! మడి, ఆచారం, తడి బట్టలతో నీళ్ళు తెచ్చుకోటాలు, వీధరుగుల మీద వేదం చెప్పుకుంటూ జంధ్యాలు-వడుక్కోటాలు, పట్టుబట్టలతో గుళ్ళోకి వెళ్ళటాలు ఇవన్నీ వున్నాయి కదా! ఇవన్నీ ఉన్నప్పుడు కోటాయి ముఖదర్శనమే పనికిరాదు. గదా! అలాంటప్పుడు ఆ వీధిలోకి రావడమెలా సాధ్యం? అసలీ బాపనాయనకి, మాదిగాయనకి ఈ సంబంధమేవిటి? పున్నయ్యగారి తాతకి కోటయ్య తాత పొలం చేసేవాడు.

పున్నయ్యగారిని పున్నయ్యగారన్నాం కదా, ఆ నోటితో కోటాయిని కూడా కోటాయిగారు అంటే ఏం పోయిందో?

పోన్లెద్దురూ! గారూ వల్ల వొరిగేదేముంది - ఆ వొరిగేదేదో వాళ్ళే వొంచుకోనివ్వండి.

ఇంతకీ పున్నయ్యగారికి కోటాయితో మాట్లాడ్డానికి, కోటాయి వారింటికి నడవటానికి దోవ లేకపోయింది. అంచేత పున్నయ్యగారు కృష్ణవైపు దొడ్డి గోడ పగల గొట్టించి అక్కడ ఓ ద్వారం ఏర్పాటు చేశారు. గుళ్ళో దేవుడెలా వుంటాడో

తెలియని కోటాయి గుడి ప్రాకారం చుట్టి వచ్చి కృష్ణ వొడ్డుగా నడిచి పున్నయ్యగారి దొడ్లోకి వచ్చేవాడు. కోటాయికోసం ప్రత్యేకంగా పెట్టించిన వాకిలి గనుక అది కోటాయి వాకిలి అయింది. అలా కోటాయివాకిట్లోంచి వెళ్ళి రత్తమ్మ గారింట్లో కరివేపాకందుకో' అనటం అలవాటయింది.

కోటాయి పున్నయ్యగారి దొడ్లో కుడితి గాబు పక్కన కూర్చున్నాడు. నల్లగా బుర్ర మీసాలు. మోకాటిపైకి పంచె. పున్నయ్యగారు కొట్టంలో గుంజకానుకుని కూర్చున్నారు. లెక్కలు డొక్కలు చూసుకోటానికి ముందు పున్నయ్యగారు కుటుంబ సమాచారాలు మాట్లాడతారు.

"వరదాయిని చదువులోపెడ్తావా."

"సదువులో పెడ్తే పాలవోఁ -- రెక్కాడితేగాని డొక్కాడనోళ్ళం మాకు సదువెందుకయ్యా!"

"ఒరే చినకోటాయిది పెద్ద సంసారం ఎట్లా ఈదుకొస్తున్నాడో?"

"ఒకటే ఈత. ఓ పూట గంజి.ఇంకోపూట పస్తు."

"వీరెంకాయికి చూపు తగ్గిపోతోందేరా."

"ఆడి పనయిపోయింది లెండి."

ఆపైన లెక్కలు చూసుకున్నారు. పున్నయ్యగారు కాగితఁ మీద లెక్కలేస్తే. కోటాయి మనసులోనే లెక్క కట్టేవాడు. అరగంటసేపు కూడికలు. తీసివేతలు వేసి పున్నయ్యగారు ఓ అంకె చెప్తే అంతకు అయిదునిమిషాలముందే ఆ అంకె చెప్పేవాడు కోటాయి పున్నయ్యగారు ఆశ్చర్యపోయి "నువ్వు చదువుకుంటే ఎంత పెద్దోడివయ్యేవాడివోరా!" అంటే కోటాయి చిత్రంగా నవ్వి 'మా అయ్యకి పలకెట్ట గుంటదో తెలియదు. ఇంక సదువు మాటేటి. మా బతుకులిట్టా ఎల్లిపోతే అదే సాలు అనేవాడు.

ఎప్పుడూ కోటాయే బాకీ తేలేవాడు. ఎప్పుడూ బాకీ పూర్తిగా ఇవ్వలేక పోయేవాడు. పున్నయ్యగారు గింజుకుని, కసురుకుని, అరిచి ఆఖరికి 'సరే' అని సర్దుకునేవాడు. ప్రతి సంవత్సరం ఇది మామూలే.

కోటాయి వెళ్ళిపోయిం తర్వాత ఆడవాళ్ళు అతను కూర్చున్నచోట ఆవుపేడ కల్లాపి చల్లి శుద్ధి చేసేవారు.

ఇరవై ఏళ్ళు గడిచాయి.

కోటాయి ఇప్పుడు బ్రాహ్మణవీధి లోంచి నడిచి పున్నయ్యగారి ముందు గుమ్మంలోంచి ఇంటి వసారాలో కొచ్చి కూర్చుంటున్నాడు. పున్నయ్యగారు సరాసరి గూడెంలోని బావి దగ్గరకెళ్ళి కోటాయిని పిలుస్తున్నాడు. వెనక క్రిష్ణకెళ్ళి మంచినీళ్ళు తాగే కోటాయి పున్నయ్యగారింట్లో చెంబుతో నీళ్ళుతాగి దాహం తీర్చుకుంటున్నాడు. కోటాయి కొడుకులూ,పున్నయ్య గారి కొడుకులూ హైస్కూల్లో ఒకే బెంచీ మీద కూర్చుని చదువుతూ "ఒరేయ్!" అని పిలుచుకుంటున్నారు. కలిసి కబాడీ ఆడుతున్నారు. కలసి కాఫీ తాగుతున్నారు.

అయ్యా! అదీ సంగతి.

కథయి పోయిందేమిటి?

మరి కొంచెం ఉంది.

అవధాన్లుగారు బహిరంగంగా నడిబజార్లో కోమటి కొట్లో చిట్టిగారెలు తింటున్నారు. చాకలి వీరాయి కొడుకు పంచాయితీ ఆఫీసరు చేస్తున్నాడు. అభిషేక బ్రాహ్మలు సాయంత్రాలు పాంటు షర్టు లేస్తున్నారు. అర్చకులు హిప్పీ క్రాపులు, కటింగు మీసాలు పెట్టారు. ముతరాసు పోలయ్య పొగాకు వ్యాపారం చేస్తున్నాడు. పురోహితుడు పొద్దుకూకంగానే మద్యం సేవిస్తున్నాడు. ఒకప్పటి బస్ క్లీనరు లారీలు కొని, ఆ పైన పంచాయితీ ప్రెసిడెంటు అయ్యాడు. హరి కథలు పురాణాలు వినిపించటం లేదు. సినిమాకి టిక్కట్టు దొరకటం లేదు. కాలేజీ కుర్రాళ్ళు అమ్మాయిల వేటకోసం గుళ్ళోకి పెందరాళే వస్తున్నారు. కట్నం ఇవ్వలేని ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు కావటం లేదు. బాకీల తాకట్టు కింద ఇళ్ళు చేతులు మారుతూనే ఉన్నాయి. రోజూ సూర్యుడు ఉదయించి కుంకుతూనే ఉన్నాడు. అదీ కథ.

ఇదేమికథ అంటున్నారా తమరు? అయ్యా! మీకు తీపి తినటం అలవాటయింది. పచ్చడి కూడా రుచే! పైగా తమరు చారులో కొచ్చేశారు. గమనించండి.*